ఓం|శ్రీసాయిరాం

పుస్తకముల్ పఠించితిని పూర్తిగజూచితి సర్వ శాస్త్రముల్
నిస్తులమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల? నీ
హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితొ కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియును పాడగు విద్యలె చూడ మానవా!

ఈ ప్రకృతియందు విద్యలన్నీ నేర్చినను విలువ సున్న. కాని, తెలియలేక మానవులు తెలివి తప్పి గర్వపడుతున్నారు. ఎన్ని విద్యలు నేర్చియు ఏమి ఫలము? ఈ విద్యలందు ఉన్న ఫలము ఏమని తెల్పుదు ఈ సభయందు!

ఆర్య ధర్మములెల్ల ఆరిపోయె
తల్లి భాషను మాటాడ తప్పు తోచె
సంఘ మర్యాద పాటింప జంకు పుట్టె
భారతావని ధర్మ భాగ్యంబు కాపాడ
భాధ్యతంతయు మీదె భక్తులార!

ప్రేమస్వరూపులారా! ఈనాడు లోకములో కాలమే తెలియని విధంగా అన్నీ త్వరితగతిని జరిగిపోతున్నాయి. చూస్తూ ఉండగనే క్షణములు, ఘడియలు దాటిపోతున్నవి. అరవై క్షణములైతే ఒక నిముషము. అరవై నిముషములైతే ఒక గంట. కాని, ఈనాడు క్షణములో గంటలు మారిపోతున్నవి. దీనికి కారణమేమిటి? మానవునియొక్క మనస్తత్త్వమే. మానవుని మనస్సు క్షణక్షణమునకు మారిపోవుచున్నది. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' మనస్సే బంధ, మోక్షములకు మూలకారణం. మనస్సంటే ఏమిటి? కోరికల మూట. ఈ కోరికలను మనము కొంతవరకు అరికట్టుకోవాలి. మానవుడీనాడు అన్నింటినీ అరికట్టగలుగుతున్నాడు. గాని, తనను తాను అదుపులో పెట్టుకోలేక పోతున్నాడు. అన్నింటినీ అదుపులో పెట్టి తాను మాత్రం అదుపు తప్పి తిరుగుతుంటే ఏమి ప్రయోజనం?

ప్రేమస్వరూపులారా! మొట్టమొదట మనస్సును భగవంతునికి అర్పితం చేయాలి. మనస్సు భగవత్ వరప్రసాదం. భగవంతుడిచ్చిన మనస్సును తిరిగి భగవంతునికే అర్పితం చేయాలి. ఈవిధమైన క్రమపద్ధతిని మనము అనుసరించినప్పుడే సంపూర్ణమైన ఆనందమును అనుభవించవచ్చును.

జనని గర్భమునుండి జన్మించినప్పుడు
కంఠమాలలవేమి కానరావు
మంచి ముత్యపు సరుల్మచ్చునకును లేవు
మేల్మి బంగరుదండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చలు కెంపులు పరగ లేవు
వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు
గోమేధికంబులు తోడులేవు
కలదు కలదొక్క మాల మీ కంఠమందు
ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి
మంచిదైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల!

ఈ సృష్టి అంతయు భగవంతుని వరప్రసాదమే. ఇట్టి వరప్రసాదమును మనము భద్రంగా కాపాడు కోవాలి. మానవునికి మూడు గుణములున్నవి. ఒకటి సాత్త్విక గుణము, రెండవది రజోగుణము, మూడవది తమోగుణము. సాత్త్విక గుణాన్ని మనము భద్రంగా పెట్టుకోవాలి. దుష్టచింతన చేసెడి దుర్మార్గునకు అంతటా దుష్టత్వమే కనిపిస్తుంది. మంచి భావాలు కలిగిన మనుజునకు సర్వత్రా మంచి దృశ్యములే కనిపిస్తుంటాయి. ఎట్టి సంకల్పములూ లేని మానవుడు మాత్రమే పూర్ణుడై, నిత్యుడై శాంతినొందగలడు. దారములు పడుగు, పేకగా చేరటం చేతనే వస్త్రము తయారౌతుంది. కర్మఫలితమనే త్రాడు ఎక్కడినుండి వచ్చింది? జన్మాంతర సంస్కారములనే ప్రత్తినుండి వచ్చింది. ప్రత్తినుండి దారము తీసి, దారమును వస్త్రముగా నేసి దానిని

మనము ధరిస్తున్నాము. మనం ధరించిన దేహమనే వస్త్రముకూడా భగవంతుని వరప్రసాదమే.

ఉభయభారతి మహాజ్ఞాని. ఆమె మండనమిశ్రుని భార్య. ఒకనాడామె తన శిష్యురాండ్రతోకూడి గంగానదికి వెడుతుంటే మార్గమధ్యంలో ఒక చెట్టుక్రింద ఇసుకపై పరుండిన ఒక సన్యాసిని చూసింది. అతడు సర్వసంగపరిత్యాగి. ప్రజలు అతనిని 'బ్రహ్మజ్ఞాని' అని పిలిచేవారు. అయితే, తాను నీరు త్రాగటానికి ఉపయోగించే మట్టి కుండను ఎవరైనా దొంగిలిస్తారేమో అనే భయంచేత అతడు దాని తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. అది చూసి ఉభయభారతి 'అయ్యో పాపం, నేను ఇతనొక మహాత్యాగి అనుకున్నాను. కాని, తన నీటికుండపై అతనికింకా అభిమానం పోలేదు. కాబట్టి, ఇతను సర్వసంగ పరిత్యాగి కాదు' అని అతను వినేటట్లుగా గట్టిగా చెప్పింది. ఆమె మాటలు అతనికి కోపం తెప్పించాయి. వాళ్ళు గంగలో స్నానమాచరించి తిరిగి వస్తుండగా అతడా కుండను తీసి విసిరేశాడు. అప్పుడు ఉభయభారతి, 'అయ్యో, ఇతనిలో అభిమానమొక్కటే ఉన్నదనుకున్నాను. కాని, అహంకారముకూడా ఉన్నది' అన్నది. అప్పుడతను తన పొరపాటును గ్రహించి, ఉభయభారతి పాదాలపై పడి, 'అమ్మా! మీరీనాడు నాకు కన్నులు తెరిపించారు' అన్నాడు. అప్పుడు ఉయభారతి, 'నాయనా! ఈ ప్రపంచమంతయు కేవలం భ్రమతో కూడినది. ఈ ప్రపంచములోని అనేకవిధములైన రూపములు మానవుని ఆకర్షిస్తున్నవి. అయితే, అవన్నీ మనలోనుంచి వచ్చినవేగాని, ఎక్కడో బయటనుండి వచ్చినవి కావు. ప్రతి ఒక్కటీ నీకై నీవే కల్పించుకుంటున్నావు. కొంతకాలము నీ దేహమును నీవు ప్రేమిస్తున్నావు. ఆ తరువాత నీ దేహము నీవే విసర్జిస్తున్నావు. దేహమును వరించేదీ నీవే! విసర్జించేదీ నీవే! వరించటంగాని, విసర్జింటంగాని భ్రాంతులే! నీవు దేహభ్రాంతిని అభివృద్ధిపరచుకుంటున్నావు. దేహభ్రాంతిని విసర్జించి దైవాభిమానమును అభివృద్ధిపరచుకో. దేహము దైవమందిరము. దేహిని దేవదేవునిగా భావించు' అని బోధించింది.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

ప్రాపంచికమైన భావములన్నీ అజ్ఞాన జనితములైనవి. ఇవి సత్యమైనవి కావు, నిత్యమైనవి కావు. ప్రాణము ఉండినంత వరకు ఒక దేహము మరొక దేహాన్ని ప్రేమిస్తుంది. దేహము ఉండినంతవరకు భర్త భార్యను ప్రేమిస్తాడు. ఈ ప్రేమ కేవలం దేహ సంబంధమైనది. రెండు దేహములూ ఒకేతూరి రాలేదు, ఒకేతూరి పోవు.

పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం
ఇహ సంసారే బహు దుస్తారే కృపయా పారే పాహి మురారే.
భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్ కరణే.

మానవుడీనాడు మంచి పుష్టిగా, సంతుష్టిగా వుండవచ్చును. కాని, రేపటి దినము ఏవిధంగా మారుతుందో చెప్పలేము. దేహము ఒక కారు వంటిది. మనస్సే స్టీరింగు. తన మనస్సే తన స్వాధీనంలో లేనప్పుడు దేహము తన స్వాధీనంలో ఎలా ఉండగలదు?

ప్రేమస్వరూపులారా! ఈ పది దినములనుండి ఇక్కడ చేరి యజ్ఞములో పాల్గొన్న ఋత్విక్కులలో ప్రతి ఒక్కరి స్వభావము ఎంతో గొప్పది. వారిలో ఎన్నివిధములైన భావములుండినప్పటికీ భగవత్ విషయంలో వారి హృదయం నిశ్చలంగా ఉన్నది. ఇందులో యువకులుకూడా ఉన్నారు. యువత దేశానికి ఎంతో అవసరం. యువతను చూస్తే నాకెంతో ఆనందం కలుగుతుంది. వారికి ఏది కావలసినా యిస్తాను. పూర్ణాహుతి తరువాత నేను మీతో మాట్లాడి, మీ అభీష్టములను నెరవేర్చి మీతో ఆనందమును అనుభవిస్తాను. మీలో ఎందరికో వైరాగ్యభావమున్నది. కాని, కొన్ని బంధనలను వదలలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ బంధన చాలా సులభంగా విడిచి పెట్టటానికి తగిన మార్గమును మీకు చెబుతాను. మన ప్రధాన అర్చకుడే మీకందరికీ మార్గదర్శి. ఆయన ప్రతి ఒక్కటి తాను అనుభవించి, ఆనందించి మీకు దారి చూపుతున్నాడు. తాను చెప్పే ప్రతి విషయాన్ని ఆచరణలో పెట్టి జీర్ణించుకున్నాడు. అటువంటి ఆచార్యుని అనుసరించినప్పుడు ఎలాంటి అవరోధమునైనా సులభంగా అధిగమించి గమ్యం చేరుకోవచ్చును. మీరు భగవంతుని చేరుకోటం చాలా సులభం. భగవంతుడు మీవాడే. మీరు భగవంతునివారే. తండ్రికి బిడ్డకు ఎటువంటి సంబంధమున్నదో అట్టిదే మీకూ నాకూ మధ్య ఉన్న సంబంధము. కనుక, మీరు ఆనందంగా, ధైర్యంగా, సంతోషంగా కాలమును గడపండి. రేపటి దినము మిమ్మల్ని ఇక్కడనుండి పంపుతున్నానే అని నాకుకూడా చాలా కష్టంగా ఉంటున్నాది. నేనుకూడా మీ వెంటే వస్తాను. మనము ఒకరినొకరము వీడి ఉండలేము. ఇట్టి సంబంధబాంధవ్యమును నిత్యసత్యమైనదిగా భావించి నిలబెట్టుకొనుటకు ప్రయత్నించాలి. రేపటి దినము తెల్లవారుఝామునే వచ్చి మీకు ఆనందమును అందిస్తాను. (అతిరుద్రమహాయజ్ఞ సందర్భముగా భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం, సాయికుల్వంత్, 18 ఆగష్టు, 2006)